వెలమల సంస్కృతి వైభవం..
బతుకమ్మ, దాండియా వేడుకల్లో ఉత్సాహం!




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

ఎమ్మెస్సీ గోపి కుటుంబ సభ్యులకు
ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పరామర్శ..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 294 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 18 అక్టోబర్ 2026


## వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

పిల్లల భద్రత, ఇంటర్నెట్ స్వేచ్ఛ రెండూ ముఖ్యమే: సుప్రీంకోర్టు

ఆన్‌లైన్ వేధింపుల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేయాలి




## రష్యా చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్

- భారత్, చైనాలకు ఊరట..

ఉక్రెయిన్ తీవ్ర ఆగ్రహం






## బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

- 10 మంది మృతి.. 9 మందికి గాయాలు
- మరికొందరి ఆచూకీ గల్లంతు

**ఢాకా,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):**బంగ్లాదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కాక్స్ బజార్‌లో ఘోర అగ్నిప్ర మాదం చోటుచేసుకుంది. ఇనానీ ప్రాంతంలోని పటువార్టెక్ బీచ్ సమీపంలో ఉన్న ఓ సముద్రతీర విడిది కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో 10 మంది

మిగతా2లో...

## రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

● సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ ● పైపుల కాలువలతో 9,767 ఎకరాల భూమి ఆదా.. రూ.2,148 కోట్ల వ్యయం తగ్గించే అవకాశం



**హైదరాబాద్,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):**రైతుల భూములను కాపాడటంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలు లేఖలు అందజేసి, సీతారామ ఎత్తిపోతల పథకంలో సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. **రూ.2,148 కోట్ల వరకు ఆదా**సీతారామ ప్రాజెక్టు పంపిణీ కాలువలను పైపుల వ్యవస్థగా మార్చితే సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో

మిగతా2లో...



## విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

- ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోంది: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజాస్వామ్యం కోసం గొంతెత్తిన విద్యార్థినులపై ఢిల్లీ పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సిగ్గుచేటని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులను

మిగతా2లో...

## నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

● ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు ● రాష్ట్రంలో విద్యుత్ అవసరం 20 వేల మెగావాట్లు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన మేరకే వనరులను వినియోగిస్తూ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల పురస్కారాల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క పాల్గొని విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...

## గోదావరి - కావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

తెలంగాణ జల హక్కులకు ముప్పు కలిగించే ప్రయత్నాలు: హరీశ్‌రావు ఆందోళన

**హైదరాబాద్,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):**గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు పేరుతో తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు మార్గాన్ని పోలవరం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోందని

మిగతా2లో...




## ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆడపడుచులంతా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వాన్ని

మిగతా2లో...

## పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గాజు వంతెన, గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్




## క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

- మోదీ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



# వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇంటర్నెట్ వినియోగించుకునే హక్కు పెద్దలతో పాటు పిల్లలకూ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసును ప్రాతిపదికగా తీసుకుని ఇంటర్నెట్ వినియోగంపై పూర్తిస్థాయి ఆంక్షలు విధించడం సమంజసం కాదని పేర్కొంది. ఇలాంటి పరిమితుల వల్ల పిల్లలు రహస్యంగా ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రమాదం ఉందని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైనా తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనుకాడే అవకాశం ఉందని అభిప్రాయపడింది.జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ సృజనాత్మక వ్యక్తీకరణకు, సమాచార మార్పిడికి, విద్యాభ్యాసానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు, ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు ఆన్‌లైన్ వేదికలు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపింది. అదే సమయంలో పిల్లలను ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. హానికరమైన సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ వేదికలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. పిల్లల ఖాతాల భద్రత కోసం ప్రత్యేకంగా 'బాలల భద్రతా విధానం' ప్రవేశపెట్టడం మంచిదని అభిప్రాయ పడింది. చిన్నారులకు ఇంటర్నెట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం కాకుండా, వారి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రనికి సూచించింది. సురక్షితమైన డిజి టల్ వాతావరణం కల్పించేందుకు సామాజిక మాధ్య మాల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన సమా చారాన్ని తొలగిం చేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని పేర్కొంది.

# పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

**సిద్దిపేట,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** హుస్నాబాద్ పట్టణంలోని చారిత్రక ఎల్లమ్మ చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చెరువుతో పాటు గాజు వంతెన, సమీపంలోని గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు, పండుగ ఏర్పాట్లను మంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, క్రీడలు, రహదారులు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. పట్టణానికి కబడ్డీ అకాడమీతో పాటు ఈత కొలను కూడా మంజూరైనట్లు చెప్పారు.2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయని, ప్రస్తుతం కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరుగుతోందని వివరించారు. ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు రావడంతో పాటు స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ఆరోగ్యంపై దృష్టి సారించాలి.. క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి:**

**మంత్రి శ్రీధర్‌బాబు**

**వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.. త్వరలో విమానాశ్రయం, హనుమకొండలో ఐటీ టవర్**




**హనుమకొండ,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు.నాయిని విశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు జరిగిన ఈ పరుగులో 5, 10, 21 కిలోమీటర్ల విభాగాలను ఏర్పాటు చేశారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో వరంగల్ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, యువతకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని మంత్రి అంచనా వివరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భూముల సేకరణతో రైతులకు ఇబ్బందులు కలగకుండా, పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.**ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాల నివారణ**ఆయిల్‌పామ్ చెట్ల ఆకులు, కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడం వల్ల సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు ఏర్పడుతున్నాయని మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 11 కేవీ విద్యుత్తు లైన్లకు కవర్డ్ కండక్టర్లు, అవసరమైన చోట తక్కువ వోల్టేజీ లైన్లకు ప్రత్యేక కేబుళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొత్త, పాత తోటల్లో దశలవారీగా మార్పులు చేపట్టేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానం రూపొందించాలని కోరారు.**దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు**దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసి సుమారు ఒక టీఎంసీ నీటిని వినియోగించుకునే అవకాశాన్ని మంత్రి వివరించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని తెలిపారు. దీనివల్ల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. **ఖమ్మం అభివృద్ధికి నిధులు కోరిన మంత్రి**ఖమ్మం నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పథకాలకు సంబంధించిన నివేదికలను ఆమోదించి నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యాతాలకుంట టన్నెల్ పనులను త్వరగా పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు.

## నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు చలి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకునేవారని, ప్రస్తుతం వేడి నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నీరు, విద్యుత్ వంటి కీలక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం అవసరమని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ అవసరం 20 వేల మెగావాటాలకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు విద్యుత్‌ను అనవసరంగా వినియోగించకుండా పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. నీటిని కూడా వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించాలని పిలుపునిచ్చారు.

## క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

**హైదరాబాద్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా విదేశీ అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీకి అలవాటుగా మారిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గత పదమూడేళ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ అంశాన్ని కూడా అదే విధంగా ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు.శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వృత్తి నిపుణుల విభాగం అధ్యక్షుడు మధు యాష్కీలతో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని ఏ వర్గానికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.**ఎన్నికల సంఘంపై విమర్శలు** ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం నియామక వ్యవస్థలో మార్పులు చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని మైనారిటీలు, గిరిజనులు, లౌకికవాదుల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు.తెలంగాణలోనే 27 శాతం ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాల్లో మూడు నెలల వ్యవధిలో గణనీయమైన మార్పు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

## బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మరికొందరి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.మంటలు వేగంగా వ్యాపించడంతో మూడు అంతస్తుల కలప భవనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సుమారు 30 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొందరు ప్రాణాలతో బయటపడగా, మిగతావారి పరిస్థితిపై స్పష్టత రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు అవసరమైన నమూనాలను సేకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. వంటగదిలో మంటలు చెలరేగడం లేదా విద్యుత్ లోపం కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారణకు రాలేమని అధికారులు తెలిపారు.

## విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

భయభ్రాంతులకు గురిచేసి, వారు మరోసారి ప్రశ్నించకుండా చేయడమే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారు వెల్లడించిన విషయాలను రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. పోలీసుల దాడుల్లో తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, దుస్తులు లాగడం, శరీరంలోని వ్యక్తిగత భాగాలను తాకడం వంటి చర్యలకు పాల్పడ్డారని బాధిత విద్యార్థినులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. యువత, మహిళలపై పోలీసుల హింస ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, విద్యార్థినులు చేసిన ఆరోపణలపై అధికారికంగా వెలువడే వివరాలు, దర్యాప్తు ఫలితాలు కీలకం కానున్నాయి.

## ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

చాటిచెప్పే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి, పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకలు మన సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## సీజేపీ నేత అభిజీత్ దీప్కేకు బెయిల్

- ఏడాది పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని షరతు
- నిరసన ప్రదర్శనకు వెళ్తుండగా నిర్బంధం.. నేహా బోరా కూడా విడుదల

**న్యూఢిల్లీ,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో నిర్వహించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ముందస్తు చర్యల్లో భాగంగా దీప్కేపై కేసు నమోదు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోనని హామీ ఇస్తూ పూచీకత్తు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి నిర్బంధం అవసరం లేదని పేర్కొంటూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఇదే నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఆర్‌కే పురం పోలీస్‌స్టేషన్ నుంచి ఆమెను విడుదల చేశారు.

## గోదావరికావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. దీనివల్ల తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాల వాటాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై నవంబర్ 3న ఢిల్లీలో జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలగకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాల వాటాపై స్పష్టత వచ్చిన తర్వాతే నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.**గోదావరి జలాల వాటాపై స్పష్టత అవసరం** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నదుల అనుసంధాన ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- సమగ్ర భూ సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష
- భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలి.. పారదర్శకంగా సర్వే చేపట్టాలి



**హైదరాబాద్,అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్వే ప్రారంభించే ముందు భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ఇప్పటికే 2,720 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, వచ్చే నెలాఖరులోగా మొదటి దశను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూధార్ గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు చెప్పారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కొలిచి, వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు భూభారతి అంతర్జాల వేదికలో నమోదు చేస్తామని తెలిపారు. సర్వేకు సంబంధించి భూ యజమానులకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల సరిహద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# వెలమల సంస్కృతి వైభవం.. బతుకమ్మ, దాండియా వేడుకల్లో ఉత్సాహం!

### వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబరాన్నంటిన సంబరాలు

### పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం






**హనుమకొండ, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ, దాండియా వేడుకలను వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో అక్టోబర్ 16న హనుమకొండలోని న్యూ శాయంపేట, హంటర్ రోడ్డులో ఉన్న దార్వి రిసార్ట్‌లో ఈ వేడుకలు జరిగాయి. మహిళలు, యువత, చిన్నారులు, సంఘ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొనడంతో ప్రాంగణమంతా పండుగ శోభతో కళకళలాడింది.మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం నిర్వహించిన దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంగీతానికి అనుగుణంగా మహిళలు, యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సంబరాలు సభ్యుల మధ్య ఐక్యత, ఆత్మీయతను చాటిచెప్పాయి.

**సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి**

ఈ సందర్భంగా లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతకు మన వారసత్వంపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు.ఆధునిక జీవనశైలిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి ఆనందంగా గడిపేందుకు ఇలాంటి వేడుకలు మంచి అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, యువత మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని ఆకాంక్షించారు. వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

**పోటీల విజేతలకు బహుమతులు**

వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతను నిర్వాహకులు అభినందించారు. చిన్నారులు సైతం కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన సంఘ నాయకులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు, యువత, సభ్యులు, కుటుంబ సభ్యులకు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషితోనే వేడుకలు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు, కులబాంధవులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.. ఎన్నికల అధికారులు రాజీనామా చేయాలి

- చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద కాంగ్రెస్ భారీ తిరంగా ర్యాలీ
- వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతె రోహిత్ డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్ 17( పిసిడబ్ల్యూ న్యూస్):**ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పత్తర్‌ఘాట్ నుండి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు భారీ 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలు చేతబూని "రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి", "ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోతె రోహిత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు నాయకత్వంలో సుమారు నూట యాభై మందికి పైగా కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఓటర్ల తొలగింపునకు కారణమవుతున్న ప్రత్యేక తీవ్రమైన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) విధానాన్ని వెంటనే రద్దు చేయాలని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు బాధ్యులైన ఎన్నికల అధికారులందరూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా దిడ్డి రాంబాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాపాడేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఢిల్లీ వేదికగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని, ఆయన పోరాటానికి మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. ఓటు చోరీని అరికట్టేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగేది లేదని నాయకులు స్పష్టం చేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి..?

### - పాతికేళ్ల పార్టీ సేవలు.. టికెట్‌పై ఆశలు



**హైదరాబాద్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌రంగారెడ్డి మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భాజపా అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జాగృతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి పేరు ఆశావహుల్లో ప్రముఖంగా వినిపిస్తోంది.దాదాపు 25 ఏళ్లుగా భాజపాలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఆయనకు ఈసారి అవకాశం దక్కుతుందా అనే చర్చ సాగుతోంది. విద్యారంగంతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆయనకు విద్యావంతులు, నిరుద్యోగ యువత సమస్యలపై అవగాహన ఉందని అనుచరులు పేర్కొంటున్నారు.పట్టభద్రుల ఓటరు నమోదుపై కూడా ఆయన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే అభ్యర్థి ఎంపికపై భాజపా అధిష్ఠానం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. దీంతో శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ దక్కుతుందా అన్న ఉత్కంఠ నెలకొంది.

# భవాని స్వాములకు అన్నదానం.. భక్తి చాటుకున్న ఉప సర్పంచ్ దంపతులు!

### - హర్యాతండాలో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం.. ఉప సర్పంచ్ బానోత్ శ్రీను,జ్యోతి నాయక్ దంపతులకు అభినందనలు

**రఘునాథపాలెం, అక్టోబర్ 16( పిసిడబ్ల్యూ న్యూస్):** అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దైవసేవతో సమానమని చాటుతూ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం హర్యాతండా గ్రామంలో భవాని స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచ్ బానోత్ శ్రీను, జ్యోతి నాయక్ దంపతులు ఈరోజు భవాని స్వాముల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు.భవాని మాలధారణలో ఉన్న స్వాములకు భక్తితో అన్నప్రసాదాన్ని అందించి, వారి ఆశీర్వాదాలు పొందారు. భక్తులకు సేవ చేయడమే భగవంతునికి సేవ చేయడమనే సద్భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పలువురిని ఆకట్టుకుంది. ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, మానవత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా భవాని మాత ఆశీస్సులతో హర్యాతండా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భవాని స్వాములకు అన్నదానం నిర్వహించిన ఉప సర్పంచ్ బానోత్ శ్రీను, జ్యోతి నాయక్ దంపతులను పలువురు అభినందించారు.

# బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరలు, దుస్తుల పంపిణీ



**కరీంనగర్,అక్టోబర్17(పీసీడబ్ల్యూ న్యూస్):** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా 59వ డివిజన్ ముకర్రంపురాలో పారిశుద్ధ్య కార్మికులకు ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ మాజిద్ హుస్సేన్ చీరలు, దుస్తులను పంపిణీ చేశారు.పండుగల వేళ పారిశుద్ధ్య కార్మికులతో సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు.బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని కార్మికులకు చీరలు, దుస్తులు అందజేస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారితో పండుగ ఆనందాన్ని పంచుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



## బతుకమ్మ అంటే పోరాటం

బతుకమ్మకు వుంది వెయ్యేళ్ళ చరిత్ర
బతుకమ్మంటే వరంగల్
వరంగల్ అంటే నాడు నేడు
పోరాటాల చరిత్ర త్యాగాల చరిత్ర

బతుకమ్మంటే భూమి కోసం
బతుకమ్మంటే వెట్టి చాకిరీ
విముక్తికై పోరాటం
బతుకమ్మంటే రాచరికంపై పోరాటం

కాకతీయ రాజుపై పోరాడిన
సమ్మక్క సారక్కల చరిత్రను చెరపేసి
వన దేవతలుగా సృష్టించిండ్లు
పోరాట చరిత్రను మరిపించిండ్లు

సాళుల రాచరికంపై పోరాడిన
బతుకమ్మ చరిత్రను కనుమరుగు
చేసిండ్లు నాటి పాలకులు
బతుకమ్మ త్యాగానికి గుర్తు
బతుకమ్మ పండుగ

బతుకమ్మంటే బహుజనుల పండుగ
బతుకమ్మంటే శ్రమజీవుల పండుగ
కావాలి నేడు వాళ్ళ సజీవ చరిత్ర
పోరాటాల చరిత్ర

\- శ్రీహరి

# ఎంపీటీసీ గోపి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పరామర్శ..




**కురవి, అక్టోబర్ 17(పిసిడబ్లూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(సి) గ్రామ శివారు గుజిలితండాకు చెందిన ఎంపీటీసీ జాటోత్ గోపి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్.డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ పరామర్శించారు. గుజిలి తండాలోని గోపి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోపి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నా సహకారం ఎల్లవేళలా ఉంటుందని గోపి సతీమణి కి. కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి మండల సమన్వయ కమిటీ చైర్మన్ అంబటి వీరభద్రం గౌడ్.గ్రామ సర్పంచ్ బాదావతు చిన్ని సిరి నాయక్.కొత్తూరు(సి) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి వేణు.సోషల్ మీడియా ఇన్ చార్జ్ జాటోత్ క్రిష్ణ.డాక్టర్ ధరావత్ వీరన్న. వార్డు సభ్యులు జాటోత్ సుజాత.యూత్ ఉపాధ్యక్షులు దయ్యాల శ్రీధర్ గౌడ్.మనీ తదితరులు పాల్గొన్నారు.

# మహాశక్తి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

### - కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి ప్రత్యేక పూజలు




**కరీంనగర్, అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆహ్వానం మేరకు ఆయన మహాశక్తి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ ఎమ్మెల్యే కవ్వంపల్లికి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి మహాశక్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, జువ్వాడి మన్మోహన్ రావు, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేవెల్లి రాజలింగం, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తమిశెట్టి రాజేష్, రామినేని రమణయ్య, కనకం అశోక్, రాపాక రాజేశ్వర్, కుంభం చిరంజీవి, కొత్తిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మందల సంపత్ రెడ్డి, ముక్కెర సతీష్ కుమార్, ఏ. రామాంజనేయులు, దూలం వీరస్వామి, విశ్వనాథుల వీరకుమార్, గుడాల మహేందర్ ఉన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి!

● కురవి, సీరోలు మండలాల పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో

**ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్**



**కురవి / సీరోలు, అక్టోబర్ 17( పిసిడబ్ల్యు న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటర్లను కలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కురవి, సీరోలు మండలాలకు సంబంధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, అర్హులైన పట్టభద్రుల ఓటర్ల నమోదుతో పాటు ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, వివిధ మండలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు వార్డు మెంబర్ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతిచెందిన ఏఎస్ఐ జాటోత్ గోపి కుటుంబానికి ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పరామర్శ

● గోపి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రభుత్వ విప్..

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



**కురవి, అక్టోబర్ 17 (పిసిడబ్ల్యు న్యూస్):** మండలంలోని కొత్తూరు (సి) గ్రామ శివారు గుజిలితండాకు చెందిన ఏఎస్ఐ జాటోత్ గోపి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ పరామర్శించారు. గుజిలితండాలోని గోపి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోపి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడు గోపి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలియజేస్తూ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కురవి మండల సమన్వయ కమిటీ చైర్మన్ అంబటి వీరభద్రంగౌడ్, గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్నిసిరి నాయక్, కొత్తూరు (సి) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి వేణు, డాక్టర్ సెల్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వీరన్న నాయక్, వార్డు సభ్యురాలు జాటోత్ సుజాత, యూత్ ఉపాధ్యక్షుడు దయ్యాల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జైస్వాల్ గార్డెన్‌లో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**- శ్రీ గౌరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన మైసమ్మ తల్లి**





**హైదరాబాద్, అక్టోబర్ 17(పిసిడబ్ల్యు న్యూస్):** జైస్వాల్ గార్డెన్‌లోని శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం అమ్మవారు శ్రీ గౌరీ దేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, హోమాలు మరియు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రముఖులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ బాధ్యులు: అధ్యక్షులు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్. చీఫ్ సలహాదారులు: జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారి. కమిటీ సభ్యులు: పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణి. పాల్గొన్న కాలనీ ప్రముఖులు: లక్ష్మయ్యగౌడ్, ఎ. సత్యనారాయణ, ఎన్. స్వామి గౌడ్, అంజయ్యగౌడ్, గోవర్ధన్ రెడ్డి, కె. సత్యనారాయణ, రాజమల్లు, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, సంతోష్ గుప్తా తదితరులు.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించేందుకు సహకరించండి

**మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి జేఏసీ నేతల విజ్ఞప్తి**

**ప్రజలంతా ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే సూచన**



**జవహర్ నగర్ అక్టోబర్ 17 (పిసిడబ్ల్యు న్యూస్):** జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేసి, పర్యావరణాన్ని పునరుద్ధరించేందుకు సహకరించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) నేతలు మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం బోయినపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. గత 25 ఏళ్లుగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలకు తీవ్రమైన పర్యావరణ, ఆరోగ్య సమస్యలను కలిగిస్తోందని జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు కాలపరిమితి ముగిసినప్పటికీ వ్యర్థాల తరలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కలుషితం కావడం, గాలి కాలుష్యం, దుర్వాసన, మీథేన్ వాయువు విడుదల వంటి సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై గతంలో జరిగిన శాస్త్రీయ అధ్యయనాలు, నిపుణుల కమిటీల నివేదికలను కూడా వారు ప్రస్తావించారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవించే హక్కును కాపాడేందుకు ఎమ్మెల్యే ప్రజాప్రతినిధిగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంతో, సంబంధిత అధికారులతో చర్చించి డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయడానికి చర్యలు తీసుకునేలా ఒత్తిడి తేవాలని కోరారు. శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పునరుద్ధరణ చేపట్టడంతో పాటు భూగర్భ జలాలు, గాలి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. అలాగే, ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు అందించాలని, సురక్షితమైన తాగునీటిని ఉచితంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల ప్రజల్లో మెజారిటీ భాగం ఐక్యంగా ముందుకు వచ్చి ఉద్యమిస్తేనే సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. కేవలం వినతిపత్రాలు, అర్జీలతోనే సమస్య పరిష్కారం కాదని, ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రజలు ఆ దిశగా ముందుకు వస్తే తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్, ఐఎఫ్‌టీయూ నాయకుడు షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, గౌరవ సలహాదారు, మాజీ ఉపసర్పంచ్ రావల్ కోల్ నర్సింహ గౌడ్, కోశాధికారి పి. శివబాబు, కో-కన్వీనర్లు గడ్డం సదానందం, మాజీ కార్పొరేటర్ ఎ. సుబ్రహ్మణ్యం, పీకేఎం రాజానర్సింహ, మహ్మద్ పాషామియా, చిందం శ్రీనివాస్, శోభ, సూర వెంకటయ్య, చంద్రమౌళి, మోనార్ దుర్గాప్రసాద్, గడిపే సునీత, జయ, జయసుధ, కుమార్, శ్రావణ్ కుమార్, టి. కాలేషా తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్ కార్డులు సత్వరమే మంజూరు చేయాలి

**టియుడబ్ల్యూజే (టిజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ**

**జిల్లా కలెక్టర్‌కు టిజెంఫ్ జర్నలిస్టుల బృందం వినతి**





**ఖమ్మం,అక్టోబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు రెండవ విడతలో విడుదల కావలసిన అక్రిడేషన్ కార్డులను సత్వరమే మంజూరు చేయాలని టి యు డబ్ల్యూ జే (టిజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు డిమాండ్ చేశారు. ఖమ్మం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను టి జే ఎఫ్ జర్నలిస్టుల బృందం శుక్రవారం కలిసి అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు మాట్లాడుతూ... పెండింగ్ లో ఉన్న పెద్ద పత్రికలు, మీడియం, చిన్న పత్రికలు, అదేవిధంగా కేబుల్ చానల్స్, డెస్క్ జర్నలిస్టులకు మంజూరు కావాల్సిన అక్రిడేషన్ కార్డులను సకాలంలో ఇవ్వకుండా ఐ అండ్ పి ఆర్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, అక్రిడేషన్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసిన కూడా ఇంతవరకు కార్డులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపు జిల్లాలో 290 కి పైగా అక్రిడేషన్ కార్డులు ఇంకా మంజూరు కావాల్సి ఉందని, అనేక ఆటంకాలు సృష్టిస్తూ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ.. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్ కార్డులను సత్వరమే మంజూరు చేయాలని అక్కడే ఉన్న డిపిఆర్ఓ గౌస్ పాషా ను ఆదేశించారు. కాలయాపన చేయకుండా సకాలంలో అక్రిడేషన్లు ఇవ్వాలని, కేబుల్, డెస్క్ జర్నలిస్టులకు, అదేవిధంగా బిగ్ పేపర్లకు, మీడియం, స్మాల్ పేపర్లలో ఇంకా పెండింగ్ లో ఉన్న వారందరికీ తక్షణమే అక్రిడేషన్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, మందుల ఉపేందర్, ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందటి వెంకటరమణ, అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఫోటోగ్రాఫర్ రాజు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, పానకాలరావు, ప్రభాకర్ రెడ్డి,జీవన్ రెడ్డి, పులి శ్రీను,రేపాక యాదగిరి, నగర కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు యలమందుల జగదీష్, కరీష అశోక్, జిల్లా నాయకులు మోహన్, కె.వి, సాయి, కళ్యాణ్, నాగరాజు, తిరుపతిరావు, ఉల్లోజు రమేష్, గౌరీ శంకర్ , ఇసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, కూరపాటి నరేష్ ,మహిళ ప్రతినిధులు రోజా, మాధవి, కిరణ్మయి, రవి, పెంటి వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరగని సేవలకు అందని భరోసా!



**పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

**హెల్త్ కార్డులు, పెండింగ్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య**

**ఖమ్మం ప్రతినిధి,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు వృద్ధాప్యంలో అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. వైద్య సదుపాయాలు అందక, ఆర్థిక బకాయిలు విడుదల కాక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం నగరంలోని కృషిభవన్‌లో పరిశ పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. ఐదు నెలలుగా ఉద్యోగులు, పెన్షనర్ల వేతనాల నుంచి ఆరోగ్య పథకం ప్రీమియం మినహాయిస్తున్నప్పటికీ, అర్హులకు హెల్త్ కార్డులు అందకపోవడం విచారకరమని నాయకులు పేర్కొన్నారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు ప్రత్యేక అవకాశం కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. **పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి** 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్ తదితర బకాయిల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని నాయకులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరవుభత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 తర్వాత పదవీ విరమణ చేసిన వారు కరవుభత్యం బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఈ బిల్లులు నేరుగా ఖజానా శాఖలోనే తయారయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ సంఘం నివేదికను వెంటనే వెల్లడించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సంక్షేమం కోసం ప్రత్యేక సంచాలక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పెన్షనర్లు సమావేశమయ్యేందుకు భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 17న నిర్వహించే పెన్షనర్ల దినోత్సవాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో అధికారికంగా నిర్వహించాలని కోరారు. పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించి, హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంయుక్త అధ్యక్షుడు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, కె. శ్యామ్‌సుందర్, జిల్లా కార్యదర్శులు తాడి అంజలి, బోజెడ్ల కృష్ణకుమారి, బెల్లం రాధాకృష్ణమూర్తి, కనపర్తి నాగప్రసాద్, ఊడుగు సుధాకర్‌రావు, పి.వి.ఆర్.కే. ప్రసాదరావు, మహ్మద్ హుస్సేన్, చాపలమడుగు సుధాకర్ పాల్గొన్నారు.

# వరకట్నం తీసుకున్నా.. ఇచ్చినా చట్టరీత్యా నేరమే!

**• మహిళల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలి • జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ**




**హనుమకొండ,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** వరకట్న దురాచారాన్ని సమాజం నుంచి నిర్మూలించేందుకు ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ పిలుపునిచ్చారు. వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని, వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలకు న్యాయపరమైన అండగా నిలవాలని న్యాయమూర్తి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో వరకట్న నిషేధ చట్టం, చట్టంతో విభేదించిన బాలల హక్కులు, వారికి కల్పించాల్సిన రక్షణ చర్యలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను న్యాయమూర్తులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలల హక్కుల పరిరక్షణలో చట్టాల ప్రాధాన్యాన్ని వివరించారు. వరకట్న వేధింపులకు గురయ్యే మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, వారికి అందుబాటులో ఉన్న న్యాయ సహాయం, చట్టపరమైన రక్షణలను వినియోగించుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం అందించడంతో పాటు, మహిళల పట్ల వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అదే విధంగా, చట్టంతో విభేదించిన బాలలను నేరస్థులుగా ముద్రవేయకుండా, వారి పరిస్థితులను అర్థం చేసుకుని సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. బాలల హక్కులు, గౌరవం, వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ, వారికి విద్య, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా మెరుగైన భవిష్యత్తుకు మార్గం చూపాలని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, అర్హులైన బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడం, మహిళలు, బాలల హక్కులను పరిరక్షించడం లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయమూర్తులు పద్మజ, క్షమాదేశ్ పాండే, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# మూసాపేటలో నకిలీ మిఠాయి దుకాణంపై పోలీసుల దాడి

**• దుకాణం పేరు బోర్డుల తొలగింపు.. తయారీ సామగ్రి స్వాధీనం**

**• బ్రాండ్ పేరును అక్రమంగా వాడితే చర్యలు తప్పవు: అసలు యజమాని హెచ్చరిక**






**హైదరాబాద్, అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రసిద్ధ 'ఢిల్లీ మిఠాయి వాలా' బ్రాండ్ పేరును అక్రమంగా ఉపయోగిస్తూ నాసిరకం మిఠాయిలు విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో మూసాపేటలోని ఓ స్వీట్ షాపుపై కూకట్‌పల్లి పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి దుకాణ యజమాని మున్నా లాల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూసాపేటలోని శశికళ, లక్ష్మీకళ సినిమా థియేటర్ల సమీపంలో 'ఢిల్లీ మిఠాయి వాలా స్వీట్ హౌస్' పేరుతో మున్నా లాల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. తమ సంస్థ రిజిస్టర్డ్ బ్రాండ్ పేరును అనుమతి లేకుండా ఉపయోగిస్తున్నారని, నాసిరకం మిఠాయిలు తయారు చేస్తున్నారని అసలు బ్రాండ్ యజమాని జితేందర్ కచ్వా, ఆయన న్యాయ బృందం కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు దుకాణంపై దాడి చేసి 'ఢిల్లీ' పేరుతో ఉన్న నేమ్‌బోర్డులను తొలగించారు. గోదాములో ఉన్న మిఠాయిలు, వివిధ రకాల రుచికారక పదార్థాలు, ప్యాకింగ్ కవర్లు, బిల్లింగ్ యంత్రాలు, స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జితేందర్ కచ్వా మాట్లాడుతూ.. తమ సంస్థ 1968 నుంచి 'ఢిల్లీ మిఠాయి వాలా' పేరుతో వ్యాపారం నిర్వహిస్తోందని తెలిపారు. కొందరు తమ బ్రాండ్ పేరును అనధికారికంగా ఉపయోగిస్తూ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. తమ బ్రాండ్ పేరును అక్రమంగా వాడుతున్న ఇతర దుకాణదారులు వెంటనే ఆ పేరును తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి దుకాణాలపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

# ఖైదీల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించి ఖైదీలతో మాట్లాడిన కందుకూరి పూజ**



**హనుమకొండ,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** న్యాయపరమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖైదీలకు అవసరమైన సహాయాన్ని అందించడం, వారికి అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించడం కీలకమని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ పేర్కొన్నారు. న్యాయ సహాయం అవసరమైన ఖైదీల సమస్యలను గుర్తించి, వారి కేసుల పురోగతిపై అవగాహన కల్పించేందుకు సంబంధిత వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించిన న్యాయమూర్తి కందుకూరి పూజ, అక్కడి పరిస్థితులను పరిశీలించడంతోపాటు ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలపై ఆరా తీశారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్ పనితీరును పరిశీలించి, ఉచిత న్యాయ సహాయ సేవలు ఏ విధంగా అందుతున్నాయనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి వారి కేసుల స్థితిగతులు, న్యాయపరమైన ఇబ్బందులు, అవసరమైన సహాయం గురించి వివరాలు సేకరించారు. న్యాయ సహాయం అందుబాటులో ఉండటం ద్వారా ఖైదీలు తమ కేసులకు సంబంధించిన అంశాలను అర్థం చేసుకోవడంతోపాటు, న్యాయపరమైన ప్రక్రియపై స్పష్టత పొందే అవకాశం ఉంటుందని ఈ సందర్శన ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా అవసరమైన సహాయాన్ని గుర్తించేందుకు ఈ సందర్శన దోహదపడింది. జైలర్ జలేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మోటార్ల దొంగతనాల కేసులను ఛేదించిన పోలీసులు

**• ఐదు కేసుల్లో ఏడుగురి అరెస్టు**

**• రూ.2.80 లక్షల విలువైన మోటార్లు, కేబుల్ వైర్లు స్వాధీనం**





**పెనుబల్లి,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను వి.ఎం. బంజర్ పోలీసులు అరెస్టు చేశారు. ఐదు కేసులను ఛేదించి, వారి నుంచి రూ.2.80 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సత్తుపల్లి రూరల్ సీఐ పంజాల సర్వయ్య వెల్లడించారు. వి.ఎం. బంజర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల చోరీలకు సంబంధించి ఐదు కేసులు నమోదయ్యాయి. వీటిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఏడుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి ఏడు విద్యుత్ మోటార్లు, 200 మీటర్ల కేబుల్ వైర్లు, మోటార్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.80 లక్షలుగా అంచనా వేశారు. అరెస్టయిన వారిలో పెనుబల్లి మండలం గణేశ్‌పాడుకు చెందిన రావూరి పవన్ కల్యాణ్, తిరువూరు మండలం కోకిలంపాడుకు చెందిన జొన్నలగడ్డ నాగరాజు, పెనుబల్లి మండలానికి చెందిన కళ్లం జగన్, ఎస్.కె. రఫీ, రావూరి నాగేశ్వరరావు, రావూరి సాలు అలియాస్ సల్మాన్, రావూరి లక్ష్మణరావు అలియాస్ వరప్రసాద్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఏడుగురిలో నలుగురిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాల దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రైతులు తమ పరికరాలకు భద్రత కల్పించుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కేసులను ఛేదించిన సత్తుపల్లి ఏసీపీ వసుంధర యాదవ్, ఐపీఎస్, రూరల్ సీఐ పంజాల సర్వయ్య, వి.ఎం. బంజర్ ఎస్ఐ ఎస్.కె. షకీర్, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# కవి రాంబాబుకు అరుదైన గౌరవం

**'దర్పణ స్వరాలు' కవితా సంకలనంలో కవితల సమీక్షకుడిగా గుర్తింపు**

**కవి రాంబాబును సత్కరించిన ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్**



**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, తెలంగాణ సామాజిక రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబుకు సాహిత్య రంగంలో అరుదైన గౌరవం లభించింది. ఏడు సంవత్సరాలుగా కవితలను సమీక్షిస్తూ సాహిత్య సేవ చేస్తున్న ఆయనను ప్రముఖ కవి, కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ సత్కరించారు. 'దర్పణం' సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన 'దర్పణ స్వరాలు' కవితా సంకలనాన్ని తెలంగాణ సాహిత్య కళా పరిషత్ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి, కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, కవి సంగమం నిర్వాహకుడు యాకూబ్ ఆవిష్కరించారు. దర్పణం వాట్సాప్ సాహిత్య వేదికలో కవులు రాసిన కవితల నుంచి ఎంపిక చేసిన 65 మంది కవుల 130 కవితలను ఈ సంకలనంలో ప్రచురించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ రాయవరం సూర్యప్రకాశరావు చేస్తున్న సేవలను ప్రశంసించారు. వర్ధమాన కవులను ప్రోత్సహిస్తూ, విభిన్న అంశాలపై రచనలు చేసేలా ప్రేరణ కల్పించడం అభినందనీయమన్నారు. సమాజంలో చైతన్యం కలిగించేలా, ప్రజలను ఆలోచింపజేసే అంశాలను కవులు తమ రచనల్లో ప్రతిబింబించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలతో పాటు సామాజిక సమస్యలపై కూడా కవితలు రాయాలని పేర్కొన్నారు. డాక్టర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 2019 నుంచి సాహిత్య వేదిక ద్వారా కవులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ ఒక అంశాన్ని ఎంపిక చేసి, దానిపై కవులు రాసిన కవితలను సమీక్షిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 1,900కు పైగా కవితల సమీక్షలు నిర్వహించినట్లు వివరించారు. ఎంపిక చేసిన ఉత్తమ కవితలను బైసా దేవదాస్ సంపాదకత్వంలోని 'నేటి నిజం' పత్రికలో ప్రచురిస్తున్నట్లు తెలిపారు. తొర్రూరుకు చెందిన కవి ఇమ్మడి రాంబాబు ఏడు సంవత్సరాలుగా కవితలను సమీక్షిస్తూ సాహిత్య రంగానికి సేవలందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి, పర్మి వెంకట సత్యమూర్తి, రామకృష్ణ, చంద్రమౌళి, గుర్రాల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, అరుణ్ జ్యోతి, గుండం మోహన్‌రెడ్డి, వద్దిరాజు ప్రవీణ్‌కుమార్ తదితర కవులు పాల్గొన్నారు.

# పచ్చ గన్నేరు కుంట చెరువు పరిశీలన: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



**వేంసూర్, అక్టోబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పచ్చ గన్నేరు కుంట చెరువును వేంసూరు మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో నీటి పరిస్థితి, నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్న ఆయన, నీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో సామూహిక కుంకుమ పూజలు

**- ప్రత్యేక అలంకరణలో వాసవీమాత అమ్మవారు.. పూజల్లో పాల్గొన్న మహిళలు**



**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని శ్రీ వాసవీమాత ఆలయం, గాయత్రీ మందిరం, భద్రకాళి ఆలయాల వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. శ్రీ వాసవీ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో సారంగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వాసవీమాత అమ్మవారిని శనివారం శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లక్ష్మీ అష్టోత్తరాల నడుమ మహిళల కోసం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు చలువాది సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగేశ్వరరావు, కోశాధికారి బోనగిరి శంకర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. పూజల అనంతరం మహిళలకు అమ్మవారి వద్ద పూజించిన గాజులు, మంగళప్రదమైన వస్తువులను అందజేశారు. చలువాది అనుపమ, తేరాల కళావతి, ఇందిరతో పాటు పలువురు మహిళలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతిరోజూ పురోహితులు కొల్లావఝ్ఝల రమేష్ శర్మ, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో దేవి ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భవానీ మాలలు ధరించిన భక్తులు సైతం ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

# కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ బాధ్యతల స్వీకరణ



**కరీంనగర్,అక్టోబర్17(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కరీంనగర్ ఆధ్వర్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) నిర్వహించారు. ప్రభుత్వం శాశ్వత అధికారిని నియమించడంతో మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ 2026 అక్టోబర్ 16న తన పదవీ బాధ్యతలను స్వీకరించారు.బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

# షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

**- బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముజీబ్ డిమాండ్**



**కరీంనగర్,అక్టోబర్17(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముజీబ్ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లాఖాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షోయబ్ ఉల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎం.డి. ముజీబ్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్నే ఆయుధంగా చేసుకుని అక్షర పోరాటం సాగించిన ధైర్యశాలి షోయబ్ ఉల్లా ఖాన్ అని కొనియాడారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆయన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన నిర్భయ పాత్రికేయుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మైనారిటీ మోర్చా ప్రతినిధులు సమీయుల్లా అహ్మద్, మహమ్మద్ సయీద్, అబూబకర్, ఫయాజ్ చిస్తీ, సర్దార్, మహమ్మద్ ఆతీఫ్, అమీర్, రౌఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ చేసిన సేవలను స్మరించుకున్నారు.

# రైతాంగానికి అండగా నిలుద్దాం.. ధర్నాను విజయవంతం చేద్దాం

**• ఈ నెల 23న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా..**

**కదిలిరావాలని డిప్యూటీ మేయర్ సునీల్ రావు పిలుపు**



**కరీంనగర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ సునీల్ రావు విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతికొచ్చిన పంటలు సాగునీరు లేక కళ్ల ముందే ఎండిపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బావుల్లో ఉన్న నీటితోనైనా పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నిస్తుంటే, అప్రకటిత విద్యుత్ కోతలతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతులను, పంటలను ఆదుకోవాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 23న ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. రైతాంగానికి అండగా నిలిచేందుకు రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనను విజయవంతం చేయాలని సునీల్ రావు కోరారు.

# జలాలుద్దీన్ అక్బర్ నియామకం హర్షణీయం



**కరీంనగర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ నియామకం కావడం హర్షణీయమని ఎంఐఎం నాయకుడు మహమ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ అతీఫ్ భాయ్ తన బృందంతో కలిసి అక్బర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తూ, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

# రైతుల కోసం 23న మహాధర్నా విజయవంతం చేయండి

**• కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం కండి**



**కరీంనగర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శంకరపట్నం మండలంలోని ప్రతి గ్రామం నుంచి రైతులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.శనివారం శంకరపట్నం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలు, సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.రైతులకు హామీ ఇచ్చిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందడం లేదని, సాగునీటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఇచ్చిన హామీల అమలుపై నిలదీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఈ నెల 23న జరిగే మహాధర్నాకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి, ఆదిరెడ్డి, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ దొంగల రాములు, వంకాయగూడెం సర్పంచ్ మల్లేష్, గద్దపాక ఉపసర్పంచ్ జంగా జైపాల్, మండల పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరెన్సీ నోట్లతో కాళరాత్రి దేవి అలంకరణ

**ఏడో రోజు మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు**

**అమ్మవారిని దర్శించుకున్న జిల్లా సెషన్స్ జడ్జి.. ప్రత్యేక పూజలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో అమ్మవారు కాళరాత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో దర్శనానికి వచ్చిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. వేలాది మంది భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులను పలకరిస్తూ వారితో ముచ్చటించారు. కరీంనగర్ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్. శివకుమార్ ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ మహిళా కార్పొరేటర్లు సైతం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం శ్రీ లక్ష్మీ సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ 'శ్రీ భాగవత వైభవం'పై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి నిర్వహించనున్న దాండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.కాళరాత్రి దేవి ఆరాధన భయం, అహంకారం, చెడు ఆలోచనలను జయించి సత్యం, ధర్మం, న్యాయం వైపు నడవాలనే సందేశాన్ని అందిస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగేందుకు స్ఫూర్తినిచ్చే తల్లిగా కాళరాత్రి దేవిని కొలుస్తారు.

# నేడు సద్దుల బతుకమ్మ.

**- ఆకేరు జలపాతం ప్రాంతంలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాటు చేస్తున్న గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ**

**- మంచి బతుకమ్మలకు బహుమతిని ప్రకటించిన సర్పంచ్.**

**- దసరా వేడుకల్లో బహుమతి ప్రధానం.**











**తొర్రూరు ప్రతినిధి,అక్టోబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో మహిళలు అత్యంత ఉత్సాహాలతో ఆడుకునే వేడుక సద్దుల బతుకమ్మ నేడే. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ పండుగ తంగేడు పూలు, బంతిపూలు, గునుగు పూలు, గుమ్మడిపూలు, తామర పూలు, చామంతి పూలు, రకరకాల రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మధ్యలో గౌరమ్మను ఏర్పాటు చేసి తొమ్మిది రోజులు ఆడిన ప్రసాదాలను తీసుకొని బతుకమ్మ ఆడుకునే ప్రాంగణంలోకి ముస్తాబై మహిళలందరూ సద్దుల బతుకమ్మ ప్రాంగణానికి వెళుతుంటారు. బతుకమ్మ సంబరాల కోసం ఏర్పాటు చేసే ప్రాంగణాలను మహిళలు ఆటపాటలు కోలాటాలతో భక్తి పాటలతో చప్పట్లతో డీజే పాటలతో సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. ఈ వేడుకలకు ముందుగా గ్రామంలో ఉన్న డప్పు చప్పులతో గ్రామం మొత్తం తిరిగి ముందస్తుగా బయలుదేరే సమయాన్ని సూచిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం నుండి సద్దుల బతుకమ్మ ఆకేర్ ప్రాంతం వరకు తయారు చేసిన సద్దుల బతుకమ్మలను మహిళలు వారి వెనుక వెళుతుంటారు.ఈ సద్దుల బతుకమ్మ కొరకు పట్టణాలలో అధికారులు, మండల కేంద్రంలో మున్సిపాలిటీ అధికారులు, గ్రామపంచాయతీలలో సర్పంచులు వారి సిబ్బందితో మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విస్తృతమైన ఏర్పాట్లను చేస్తూ ఉంటారు. రాత్రి సమయంలో చీకటి లేకుండా భారీ లైట్లు ఏర్పాటు చేసి మహిళల సద్దుల బతుకమ్మ కొరకు అన్ని రకాల తాగనీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగానే మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం లోని గుర్తుర్ గ్రామపంచాయతీలో గల ఆకేరు జలపాతం ప్రాంతంలో ముత్యాలమ్మ దేవత ప్రాంగణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దారి వెంబడి పూర్తిస్థాయిలో వెన్నెల లా మెరిసేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సద్దుల బతుకమ్మ ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాంగణం మొత్తం చెత్తాచెదారం లేకుండా పిచ్చి మొక్కలను తొలగించి విశాలమైన మైదానం కొరకు భారీ మిషన్ లను ఏర్పాటు చేసి ఎవరికి ఇబ్బంది కలగకుండా ఆ ప్రాంతంలోనే ఉండి పూర్తిస్థాయి గ్రామ సిబ్బందితో గుర్తూరు గ్రామ సర్పంచ్ కవితా బాలకృష్ణ ఏర్పాట్లు చేయించారు. అలాగే సద్దుల బతుకమ్మలకు. కొందరు దాతలు బహుమతులను ప్రకటించారు. బతుకమ్మ పండుగలో మొదటి బతుకమ్మకు 5000 రూపాయలతో పాటు ఒక చీర, 2వ బహుమతిగా 3000 రూపాయలతో ఒక చీర, 3వ బహుమతి 2000 రూపాయలతో ఒక చీర, కన్సోలేషన్ బహుమతిగా ఒకరికి 1000 రూ.లతో ఒక చీర ఇవ్వనున్నట్లు గ్రామ సర్పంచ్ గ్రామంలో మహిళలందరికి ముందుగానే విషయాన్ని తెలియపరిచారు. బహుమతులు గెలుచుకున్న మహిళలకు దసరా వేడుకల్లో వారికి దాతల ద్వారా గ్రామపంచాయతీ ప్రాంగణంలో బహుమతి ప్రచారం చేస్తామని వెల్లడించారు. గ్రామంలోని మహిళలు సద్దుల బతుకమ్మలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేసి ఎవరు బహుమతి పొందుతారు అని వేచి చూడాల్సిందే అంటున్నారు పరిశీలకులు. బతుకమ్మ వేడుకల ప్రాంతంలో గుర్తూరు గ్రామపంచాయతీలో గల గ్రానైట్ గనుల అధికారులు వారి భారీ మెషిన్లతో సధన చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించినందుకు గ్రామస్తులు ఆ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ప్రతిఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# టీడీపీ కార్యాలయంలో వైభవంగా వెన్నెముద్ద బతుకమ్మ సంబరాలు

### సంప్రదాయ వస్త్రధారణలో మహిళల సందడి.. రంగురంగుల పూల బతుకమ్మలతో ప్రత్యేక ఆకర్షణ



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు చుండూరు రాజరాజేశ్వరి అన్నారు. ఖమ్మం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో శనివారం మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిదో రోజు 'వెన్నెముద్ద బతుకమ్మ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో వేడుకల్లో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గౌరమ్మకు పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఖమ్మం జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందిస్తాయని నాయకులు పేర్కొన్నారు. టీడీపీ మహిళా నాయకురాళ్లు రాచకొండ పావని, మందపల్లి రజిని, తాడిశెట్టి స్వాతి, జిల్లా నాయకులు కొండబాల కర్ణాకర్, కేతినేని హరీష్, వనమా వాసు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ రెడ్డి విజయానికి కృషి చేయాలి



**సత్తుపల్లి, అక్టోబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామ్‌రెడ్డి సర్వోత్తమ రెడ్డిని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పెద్దబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటర్లను కలవడం, అభ్యర్థి విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. సర్వోత్తమ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు.

# ఖోఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కాంస్య పతకం

### - విజేత జట్టును అభినందించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** 45వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలుర జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 జట్లు పాల్గొన్నాయి. కాంస్య పతకం సాధించిన జట్టు సభ్యులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అభినందించారు. క్రీడాకారులు మరింత కష్టపడి సాధన చేసి భవిష్యత్తులో జిల్లాకు ప్రథమ స్థానం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఖోఖో క్రీడ అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి కృషి చేస్తామని తెలిపారు.

# భక్తి పారవశ్యంలో దేవీ నవరాత్రులు

### - 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్

### - దేవి నవరాత్రుల సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భక్తి పారవశ్యంలో దేవీ నవరాత్రులు కొనసాగుతున్నాయని, మహిళలు పెద్ద ఎత్తున భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్నారని 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్ అన్నారు. దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ గణేష్ నగర్‌లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 48వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లే సాయికిరణ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అల్లే సాయికిరణ్ మాట్లాడుతూ... దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. భోజట్ల సత్యనారాయణ, డివిజన్ మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అల్లే సాయికిరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పద్మశాలిలకు అవకాశం

### - టికెట్స్‌లో ముందున్న ప్రొఫెసర్ గడ్డం భాస్కర్



**హనుమకొండ, కమలాపూర్ అక్టోబర్ 17 (పీసిడబ్ల్యూ న్యూస్):** గవర్నర్ కోట ఎమ్మెల్సీగా పద్మశాలి ముద్దుబిడ్డ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పించాలని మందల శంకరయ్య,మెరుగు సత్తయ్య అన్నారు. విద్యా,సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన గడ్డం భాస్కర్ కు సముచిత స్థానం కల్పించి గుర్తింపు ఇవ్వాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం లో పనిచేసిన విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ సేవలు ఎంతో అవసరమని శ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మందల శంకరయ్య, పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు మెరుగు సత్తయ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మందల శంకరయ్య మాట్లాడుతూ,తెలంగాణ ఉద్యమ చరిత్రలో కాకతీయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయుల స్పూర్తితో తెలంగాణ సాధన కోసం అనేక మంది విద్యావేత్తలు కృషి చేశారని గుర్తుచేశారు. అలాంటి విద్యా, సామాజిక నేపథ్యం కలిగిన ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించాలని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసిన గడ్డం భాస్కర్ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి,ఆదర్శ ఆచార్యుడిగా పదవీ విరమణ చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాసనసభ స్పీకర్ కార్యాలయంలో ఓఎస్‌డీ గా సేవలందించిన అనుభవం ఆయనకు ఉందని తెలిపారు. ప్రస్తుతం కూడా పలు విద్యాసంస్థలకు సలహాదారుగా వ్యవహరిస్తూ, విద్యా రంగంలో తన అనుభవాన్ని పంచుకుంటూ అధ్యాపకులు,విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తున్నారని వివరించారు. మెరుగు సత్తయ్య మాట్లాడుతూ,ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ విద్యా రంగంతో పాటు సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక రంగాల్లోనూ తనదైన పాత్ర పోషించారని అన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ కు సముచిత స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విజ్ఞప్తి చేశారు. పద్మశాలి పరపతి సంఘం సభ్యులు బండా కాళిదాస్, పేరాల కనకయ్య,చేరాల సర్వేశం,కందికట్ల శ్రీను కుమార్, ప్రొఫెసర్ రతన్ సింగ్ రాకూల్, మామిడాల ప్రకాశ్‌రావ్,పేరాల నర్సింగరావు,గాడిపెల్లి ప్రభాకర్, నమిషకవి గోవిందయ్య పాల్గొన్నారు.

# అత్యంత భక్తి శ్రద్ధలతో "వెన్నెముద్ద బతుకమ్మ" వేడుకలు

### - దేవి నవరాత్రుల అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు తోట రామారావు, గోవిందమ్మ









**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అత్యంత భక్తి శ్రద్ధలతో "వెన్నెముద్ద బతుకమ్మ" వేడుకలను 48వ డివిజన్ లోని గణేష్ నగర్, దానవాయిగూడెం పార్క్, దానవాయిగూడెం గ్రామం, ముస్తఫా నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. దేవి నవరాత్రుల సందర్భంగా ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ పరిధిలో శనివారం వివిధ అమ్మవారి మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు, గోవిందమ్మ దంపతులు పాల్గొని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గణేష్ నగర్, దానవాయిగూడెం పార్క్, దానవాయిగూడెం గ్రామం, ముస్తఫా నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని అమ్మవారి మండపాలను సందర్శించిన తోట రామారావు, గోవిందమ్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట రామారావు, గోవిందమ్మ లు మాట్లాడుతూ.. దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండుగల సందర్భంగా నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమాలు సేవాభావాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. స్థానిక భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్ కార్మికులకు దసరా బోనస్

### - కార్మికుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం: పేరాల సంపత్ రావు



**కమలాపూర్, అక్టోబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న కార్మికులకు దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.5,000 అందించనున్నట్లు సంఘం చైర్‌పర్సన్ పేరాల సంపత్ రావు తెలిపారు. సంఘం ద్వారా పంట రుణాలు పొందిన 1,156 మంది రైతులకు డివిడెండ్ కింద మొత్తం రూ.6,58,440, అంటే ఆరు శాతం చొప్పున వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. కేవైసీ వివరాలు అప్‌డేట్ చేసుకోని రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న రవాణా ఖర్చుల కింద క్వింటాలుకు రూ.15 చొప్పున అందించినట్లు తెలిపారు. ఈ ఖర్చులు అందని రైతులు సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్మికులు, రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తుందని సంపత్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు మౌటం రమేష్ బాబు, బండి కుమారస్వామి, అంబి యాదగిరి, సీఈఓ రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబై ఇండియన్స్‌కు మహేల జయవర్ధనే గుడ్‌బై!

**- పదేళ్ల అనుబంధానికి తెర.. మూడు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కోచ్**



**ముంబై, అక్టోబర్ 17:** ఐపీఎల్‌లో ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ జట్టు ప్రధాన కోచ్ మహేల జయవర్ధనే తన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ విషయాన్ని ముంబై ఇండియన్స్ యాజమాన్యం శనివారం అధికారికంగా ప్రకటించింది. దీంతో జట్టుతో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుబంధానికి ముగింపు పలికినట్లయింది.జయవర్ధనే 2017 నుంచి 2022 వరకు తొలిసారి ప్రధాన కోచ్‌గా వ్యవహరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ముంబై ఇండియన్స్ 2017, 2019, 2020 సంవత్సరాల్లో ఐపీఎల్ టైటిళ్లను గెలుచుకుంది. అనంతరం ఇతర బాధ్యతలు నిర్వహించిన ఆయన, 2025 సీజన్‌కు ముందు మళ్లీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే 2025లో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న ముంబై జట్టు, 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానానికి పడిపోయింది.తన ప్రయాణానికి ముగింపు పలుకుతూ జయవర్ధనే, జట్టుతో కలిసి సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాష్ అంబానీలకు, ఆటగాళ్లకు, సహాయక సిబ్బందికి, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న సీజన్లలో ముంబై ఇండియన్స్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 'ఇప్పటికీ నమ్మకం ఉంది'.. వైభవ్ సూర్యవంశీ ఆసక్తికర సందేశం!

**జట్టులో చోటు కోసం యువ సంచలనం ఎదురుచూపులు**

**అవకాశాలు రాకున్నా ఆత్మవిశ్వాసం కోల్పోని యువ ఆటగాడు.. అభిమానుల్లో ఆసక్తి**

**క్రీడా విభాగం:** భారత క్రికెట్‌లో యువ సంచలనంగా గుర్తింపు పొందిన వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లో నిలిచాడు. తన సామాజిక మాధ్యమ ఖాతాలో 'స్టిల్ బిలీవింగ్' (ఇప్పటికీ నమ్మకం ఉంది) అంటూ చేసిన పోస్ట్ క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. జట్టులో తనకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఎదురుచూస్తున్న ఈ యువ ఆటగాడి సందేశంపై అభిమానులు చర్చించుకుంటున్నారు. చిన్న వయసులోనే తన బ్యాటింగ్ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వైభవ్ సూర్యవంశీ, భవిష్యత్తులో భారత క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఎదుగుతాడనే అంచనాలు ఉన్నాయి. దూకుడైన బ్యాటింగ్, వేగంగా పరుగులు సాధించే సామర్థ్యంతో అతడు క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షించాడు. అయితే ప్రతిభ ఉన్నప్పటికీ జట్టులో స్థానం సంపాదించడం, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఆటగాడికీ కీలకమే.ప్రస్తుతం జట్టు ఎంపికలో చోటు దక్కకపోవడం వైభవ్‌కు ఎదురుచూపులను పెంచింది. ఈ నేపథ్యంలో అతడు చేసిన 'ఇప్పటికీ నమ్మకం ఉంది' అనే సందేశం ఆసక్తికరంగా మారింది. అవకాశాలు ఆలస్యమైనా తనపై తనకు నమ్మకం ఉంచుకోవాలనే భావన ఈ మాటల్లో కనిపిస్తోంది. అయితే ఈ పోస్ట్‌ను జట్టు ఎంపికపై అతడి అసంతృప్తిగా భావించడానికి స్పష్టమైన ఆధారాలు లేవు.**ప్రతిభకు తగిన అవకాశం దక్కేనా?** క్రికెట్‌లో యువ ఆటగాళ్లకు అవకాశాలు రావడం ఎంత ముఖ్యమో, ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం కూడా అంతే ముఖ్యం. జట్టులో ఇప్పటికే స్థిరపడిన ఆటగాళ్లు ఉండటంతో కొత్తవారికి చోటు కల్పించే



విషయంలో జట్టు యాజమాన్యం, కోచ్‌లు పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఆటగాడి ప్రస్తుత ఫామ్, జట్టు అవసరాలు, ప్రత్యర్థి జట్టు బలాబలాలు వంటి అంశాలు తుది జట్టు ఎంపికలో ప్రభావం చూపుతాయి.వైభవ్ సూర్యవంశీ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అతడికి అవకాశం దక్కితే తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు, జట్టు సమతూకాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపికలు చేయాల్సి ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తుంటారు.**అభిమానుల్లో పెరుగుతున్న ఆసక్తి**వైభవ్ చేసిన చిన్న సందేశం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటన్నది స్పష్టంగా తెలియకపోయినా, అతడి భవిష్యత్తుపై అభిమానుల్లో ఆసక్తి మాత్రం పెరిగింది. యువ ఆటగాళ్ల ప్రయాణంలో ఒడిదుడుకులు సహజమని, ఓర్పు, సాధన, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాలు సాధించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతిభకు గుర్తింపు రావడానికి కొన్నిసార్లు సమయం పట్టవచ్చు. అలాంటి సందర్భాల్లో నిరాశకు లోనుకాకుండా కష్టపడటం ఆటగాళ్లకు ఎంతో అవసరం. వైభవ్ సూర్యవంశీ కూడా తన ఆటపై దృష్టి సారించి, భవిష్యత్తులో లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటాడని అభిమానులు ఆశిస్తున్నారు.

# హాంకాంగ్ క్రికెట్ పోటీల నుంచి భువనేశ్వర్ కుమార్ తప్పుకోలు




- **భారత జట్టు సారథిగా కృనాల్ పాండ్యా**
- **భువనేశ్వర్ స్థానంలో కుల్వంత్ ఖేజ్రోలియా**

**క్రీడా విభాగం:** హాంకాంగ్ సిక్సెస్ క్రికెట్ పోటీలకు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. తొలుత జట్టుకు సారథిగా ఎంపికైన అనుభవజ్ఞుడైన వేగ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఈ పోటీల నుంచి తప్పుకున్నాడు. భారత జాతీయ జట్టుకు ఎంపిక కావడంతో న్యూజిలాండ్ పర్యటనలో పాల్గొనాల్సి ఉండటమే ఇందుకు కారణం. దీంతో అతడి స్థానంలో కృనాల్ పాండ్యాకు భారత జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించారు. భువనేశ్వర్ స్థానంలో వేగ బౌలర్ కుల్వంత్ ఖేజ్రోలియాకు జట్టులో చోటు కల్పించారు. **జాతీయ జట్టుకు ఎంపిక కావడంతోనే..** అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు హాంకాంగ్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. తొలుత ఈ పోటీల కోసం ప్రకటించిన భారత జట్టుకు భువనేశ్వర్ కుమార్‌ను సారథిగా ఎంపిక చేశారు. అయితే న్యూజిలాండ్‌తో జరిగే అంతర్జాతీయ పొట్టి క్రికెట్ పోటీలకు భారత జట్టులో అతడికి చోటు దక్కింది. దీంతో రెండు పోటీల్లో పాల్గొనడం సాధ్యం కాకపోవడంతో హాంకాంగ్ సిక్సెస్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.**కృనాల్ పాండ్యాకు సారథ్య బాధ్యతలు**భువనేశ్వర్ తప్పుకోవడంతో భారత జట్టు నాయకత్వ బాధ్యతలను ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యాకు అప్పగించారు. దేశవాళీ క్రికెట్‌తో పాటు భారత క్రికెట్ పోటీల్లోనూ అనుభవం ఉన్న కృనాల్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. తక్కువ ఓవర్లలోనే ఫలితం తేలే ఈ పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించడం కీలకం కానుంది.**భారత జట్టు ఇదే..** కృనాల్ పాండ్యా సారథ్యంలో భారత జట్టులో కుల్వంత్ ఖేజ్రోలియా, శశాంక్ సింగ్, రాహుల్ తెవాటియా, నితీశ్ రాణా, రాహుల్ త్రిపాఠి, టీ. నటరాజన్ ఉన్నారు. భువనేశ్వర్ స్థానంలో వచ్చిన కుల్వంత్ ఖేజ్రోలియా వేగ బౌలింగ్ విభాగంలో జట్టుకు అదనపు బలంగా నిలవనున్నాడు. ఈ పోటీల్లో ఒక్కో జట్టు తరఫున ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే మైదానంలో ఉంటారు. ఒక్కో ఇన్నింగ్స్‌లో ఆరు ఓవర్ల ఆట మాత్రమే ఉండటంతో బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడాల్సి ఉంటుంది.**భారత జట్టుపై అంచనాలు**హాంకాంగ్ సిక్సెస్ పోటీల్లో భారత జట్టు మెరుగైన ప్రదర్శన చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు, దూకుడైన బ్యాటర్లతో కూడిన జట్టు ఈసారి బరిలోకి దిగుతోంది. సారథ్య మార్పు నేపథ్యంలో కృనాల్ పాండ్యా జట్టును ఎలా నడిపిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 30న ప్రారంభం కానున్న ఈ పోటీల్లో భారత ఆటగాళ్లు ఏ మేరకు రాణిస్తారో చూడాలి.

# భారత్ - వెస్టిండీస్ చివరి పోరుపై వర్షం నీడ!

**- నిర్ణయాత్మక పోరుకు వరుణుడి ఆటంకం.. అభిమానుల్లో ఉత్కంఠ**

**బెంగళూరు:** భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న ఐదో, చివరి ట్వంటీ-20 క్రికెట్ పోరుపై వర్షం ముప్పు పొంచి ఉంది. ఐదు మ్యాచ్‌ల పోటీలో ఇరు జట్లు రెండేసి విజయాలతో సమంగా నిలవడంతో చివరి పోరు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పోటీల శ్రేణిని సొంతం చేసుకోనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే వాతావరణం అనుకూలించకపోతే ఇరు జట్ల విజయావకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉంది.**సాయంత్రం వర్షం కురిసే సూచనలు** బెంగళూరులోని చిన్నస్వామి మైదానంలో జరగనున్న ఈ పోరుకు వర్షం అడ్డంకిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు, సాయంత్రం వేళ జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. వర్షం కురిస్తే నాణేల టాస్ ఆలస్యం కావచ్చు. ఆట ప్రారంభమైన తర్వాత వర్షం పడితే కొంతసేపు నిలిపివేయాల్సి రావచ్చు. పరిస్థితులను బట్టి నిర్ణీత ఆట సమయాన్ని తగ్గించే



అవకాశమూ ఉంటుంది.**ఇరు జట్లకు చావోరేవో!** ఇప్పటికే జరిగిన నాలుగు పోరుల్లో భారత్, వెస్టిండీస్ జట్లు చెరో రెండు విజయాలు సాధించాయి. దీంతో చివరి మ్యాచ్‌లో గెలిచే జట్టుకే పోటీల శ్రేణి దక్కనుంది. భారత జట్టు స్వదేశంలో విజయంతో ముగించాలని భావిస్తుండగా, వెస్టిండీస్ జట్టు కూడా సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించడం, బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడం ఈ పోరులో కీలకం కానుంది.**మ్యాచ్ రద్దయితే ఏం జరుగుతుంది?** వర్షం కారణంగా ఆట నిర్వహించడం సాధ్యం కాకపోతే, నిర్ణీత పోటీ నిబంధనల ప్రకారం ఫలితాన్ని నిర్ణయిస్తారు. మ్యాచ్‌లో ఫలితం తేలకపోతే ఇరు జట్లు సమంగా నిలిచే అవకాశం ఉంది. అయితే వర్షం పడినంత మాత్రాన మ్యాచ్ రద్దవుతుందని చెప్పలేం. వర్షం ఆగిన తర్వాత మైదానం ఆటకు అనుకూలంగా ఉంటే, నిర్ణీత సమయాన్ని తగ్గించి పోటీని నిర్వహించవచ్చు. **అభిమానుల ఆశలపై వరుణుడి ప్రభావం**ఇరు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలకు చివరి మ్యాచ్ ఉత్కంఠభరిత ముగింపు ఇవ్వాలని అభిమానులు ఆశిస్తున్నారు. వర్షం ఆటకు అంతరాయం కలిగించకుండా ఉంటే పూర్తిస్థాయి పోటీని వీక్షించే అవకాశం ఉంటుంది. వరుణుడు సహకరిస్తాడా? భారత్ విజయం సాధిస్తుందా? లేక వెస్టిండీస్ జట్టు పైచేయి సాధిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# కుల్‌దీప్‌ను వదులుకోవడం ఢిల్లీకి నష్టమేనా?

**ఢిల్లీ జట్టు నిర్ణయాలపై ఆకాశ్ చోప్రా ప్రశ్నలు**

**ఆటగాళ్ల మార్పిడితో లక్నోకే ఎక్కువ ప్రయోజనమా?**

**క్రీడా విభాగం:** వచ్చే ఏడాది జరిగే ఐపీఎల్ క్రికెట్ పోటీలకు ముందే ఢిల్లీ జట్టు ఆటగాళ్ల మార్పిడి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను లక్నో జట్టుకు పంపించడం, రిషభ్ పంత్ విషయంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ భారత క్రికెటర్ ఆకాశ్ చోప్రా పలు ప్రశ్నలు లేవనెత్తాడు. ఆటగాళ్ల మార్పిడి వల్ల ఢిల్లీ కంటే లక్నో జట్టుకే ఎక్కువ ప్రయోజనం కలిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు.**కుల్‌దీప్ లేని లోటును ఎలా భర్తీ చేస్తారు?** భారత జట్టులో కీలక మణికట్టు మాయగాడిగా గుర్తింపు పొందిన కుల్‌దీప్ యాదవ్ సేవలను కోల్పోవడం ఢిల్లీకి పెద్ద లోటు కావచ్చని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ప్రత్యర్థి బ్యాటర్లను తన బంతులతో ఇబ్బంది పెట్టగల సామర్థ్యం కుల్‌దీప్‌కు ఉందని పేర్కొన్నాడు. అతడి స్థానంలో అదే స్థాయి ప్రదర్శన చేయగల మరో స్పిన్నర్‌ను తీసుకోవడం అంత సులభం కాదని తెలిపాడు.రిషభ్ పంత్ ప్రతిభావంతుడైన బ్యాటర్ అయినప్పటికీ, అతడి రాకతో జట్టుకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని చోప్రా అభిప్రాయపడ్డాడు. జట్టు కూర్పు, ఆటగాళ్ల స్థానాలు, ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించాడు.**నటరాజన్ మార్పిడిపైనా సందేహాలు**వేగ బౌలర్ టీ. నటరాజన్‌ను హైదరాబాద్ జట్టుకు పంపించి, స్పిన్నర్ జీషాన్ అన్సారీని ఢిల్లీ జట్టులోకి తీసుకోవడంపైనా చోప్రా ప్రశ్నలు లేవనెత్తాడు. కుల్‌దీప్ వెళ్లిపోయిన నేపథ్యంలో స్పిన్ విభాగాన్ని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. జట్టులో ఇప్పటికే అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్ వంటి స్పిన్నర్లు ఉన్నప్పటికీ, కొత్తగా వచ్చిన ఆటగాళ్లు ఎంతవరకు రాణిస్తారన్నది కీలకమని తెలిపాడు.**ఢిల్లీ జట్టు కూర్పుపై చర్చ**గత కొన్ని సీజన్లలో ఆశించిన విజయాలు సాధించలేకపోయిన ఢిల్లీ జట్టు, వచ్చే పోటీల కోసం మార్పులు చేపడుతోంది. జట్టులోకి కొత్త ఆటగాళ్లను తీసుకోవడంతో పాటు, కోచింగ్ విభాగంలోనూ మార్పులు చేస్తోంది. అయితే ఆటగాళ్ల మార్పిడి ద్వారా జట్టు బలపడిందా? లేక కీలక ఆటగాళ్లను కోల్పోయిందా? అన్నది వచ్చే పోటీల్లోనే తేలనుంది.**వేలంపాటపై ఆసక్తి**వచ్చే ఏడాది పోటీలకు ముందు జరగనున్న ఆటగాళ్ల వేలంపాట ఢిల్లీ జట్టుకు కీలకం కానుంది. బ్యాటింగ్, స్పిన్ బౌలింగ్, వేగ బౌలింగ్ విభాగాల్లో అవసరమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. సరైన ఆటగాళ్లను తీసుకుంటే కుల్‌దీప్ లోటును కొంతవరకు భర్తీ చేసే అవకాశం ఉంటుంది.మొత్తంగా ఢిల్లీ జట్టు తీసుకున్న నిర్ణయాలపై ఆకాశ్ చోప్రా వ్యక్తం చేసిన అభిప్రాయాలు క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీశాయి. రిషభ్ పంత్ రాకతో జట్టు ఎంతవరకు బలపడుతుంది? కుల్‌దీప్ లేని లోటును ఎలా అధిగమిస్తుంది? అన్నది వచ్చే పోటీల్లో ఆసక్తికరంగా మారనుంది.

